క్లుప్తంగా

41వ సారి రక్తదానం చేసిన అశోక్



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు అమ్మ అశోక్ ఆదివారం 41వ సారి రక్తదానం చేశారు. మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన కలవాల సతీష్‌కు సర్జరీ నిమిత్తం రక్తం అవసరం ఉండగా రక్తదానం చేసేందుకు అశోక్ ముందుకు వచ్చారు. వరంగల్ మదర్ తెరిస్సా బ్లడ్ బ్యాంకులో రక్తదానం చేశారు.

నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

ఎల్కతుర్తి : మండలంలోని సూరారం, ఎల్కతుర్తి, దండేపల్లి గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ప్రారంభించనున్నట్లు ఏపీఎం రవీందర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నడికూడ : మండల కేంద్రంతో పాటు నర్సక్కపల్లి, పరకాల మండలం వెంకటాపూర్, హైబోత్‌పల్లి గ్రామాల్లో 11 కేవీ విద్యుత్తు లైన్ల మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా సోమవారం సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఏఈ కె.విశ్వప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

అక్రమ మద్యం స్వాధీనం



గీసుకొండ: పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొమ్మాల ప్రాంతంలో గాదం రవి, అంగోతు అమర్ అక్రమంగా రూ. 8920 విలువైన మద్యంను నిల్వ చేసి అమ్మకానికి సిద్ధమవుతుండడంతో ఆదివారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం గీసుకొండ పోలీసులకు అప్పగించినట్లు వారు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

రాయపర్తి: మండలంలోని కేశవాపురం గ్రామానికి చెందిన గుజ చిన్నవీరయ్య ఇటీవల మృతిచెందగా ఆదివారం కాంగ్రెస్ నాయకులు మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా బాధితుడి కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో తొర్రూరు బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మాచర్ల ప్రభాకర్, తిరుమల కృష్ణమాచార్యులు, ఉల్లెంగుల నర్సయ్య, మచ్చ నీలయ్య, గుగులోతు శ్రీనివాస్, గుజ సుధాకర్ తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక

గీసుకొండ : గ్రేటర్ వరంగల్‌లోని 16వ డివిజన్ కీర్తినగర్ కాలనీ ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడిగా మిత్తింటి సురేందర్, కార్యదర్శిగా బొల్లం మధు, కోశాధికారిగా టి. కమలాకర్, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా కొడకండ్ల భద్రయ్య, కార్యదర్శిగా వజినేపల్లి శ్రీనివాస్, కోశాధికారిగా పుల్లూరి రమేశ్ ఎన్నికయ్యారు. పురుషుల పరపతి సంఘం అధ్యక్షుడిగా దొడ్డ బాబూరావు, కార్యదర్శిగా అయిత ప్రవీణ్, కోశాధికారిగా తాటికొండ వీరభద్రయ్య, మహిళా పరపతి సంఘం అధ్యక్షురాలిగా పిపిరిశెట్టి లక్ష్మి, కార్యదర్శిగా కొడకండ్ల వరలక్ష్మి, కోశాధికారిగా పి.స్వరూప ఎన్నికైనట్లు సంఘం నాయకులు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా దుబ్బాక శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన నాయకులు

పర్వతగిరి: నూతన ఎస్సైగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన గుగులోతు వెంకన్ననాయక్‌ను ఆదివారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి స్వీట్లు తినిపించారు. ఎస్సైని కలిసిన వారిలో బట్టు నగేష్, దబ్బెట కరుణాకర్, అనిల్, వీరన్న, భద్రు, నర్సింహా, సురేష్ ఉన్నారు.

బీజేపీ మండల ఎన్నికల కన్వీనర్‌గా శేఖర్

చెన్నారావుపేట: బీజేపీ మండల ఎన్నికల కన్వీనర్‌గా ఖాదర్‌పేట గ్రామానికి చెందిన దామెరుప్పుల శేఖర్‌ను నియమించినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి హరిశంకర్, కార్యాలయ కార్యదర్శి క్రాంతికుమార్ ఆదివారం ప్రకటనలో తెలిపారు.

శాంతిమార్గంతోనే విజయం

- పాస్టర్ కిశోర్‌పాల్
- జిల్లా వ్యాప్తంగా ఈస్టర్ వేడుకలు
- ప్రార్థనలు చేసిన క్రైస్తవులు



శాయంపేట : స్వీట్లు తినిపించుకుంటున్న క్రైస్తవులు



ధర్మసాగర్ : బాబుమోహన్‌ను ఆశీర్వదిస్తున్న పాల్సన్‌రాజ్



వేలేరు : ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



దామెర : ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

దామెర : యేసుక్రీస్తు సూచించిన శాంతిమార్గంతోనే విజయం సాధించవచ్చని దామెర బాప్టిస్టు చర్చి పాస్టర్ కిశోర్‌పాల్ అన్నారు. ఆదివారం ఈస్టర్ వేడుకలను(క్రీస్తు పునరుత్థాన మహోత్సవం) ఘనంగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఈస్టర్ జాగరణ పూజలతో ఆనంద హృదయాలతో, మృత్యుంజయ గీతాలతో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆదివారం ఉదయం నుంచి గ్రామంలోని గుట్టపై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వేడుకల్లో స్టాండింగ్ కమిటీ పెద్దలు దామెర సదానందం, వేల్పుల ప్రసాద్, దామెర రవీందర్, గోలి రామ్‌చందర్, సదిరం శంకర్, వేల్పుల సంజీవ, బాబు, స్వామి, చింటు, రాజు భక్తులు పాల్గొన్నారు. అలాగే ఊరుగొండలో ఫాదర్ గంగారపు సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించగా దివ్యబలి పూజలు జరిపించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ పత్తిపాటి కిరణ్, సంఘ పెద్దలు నర్సయ్య, మొగిలి, సాల్మన్, కుమారస్వామి, జన్ను సాంబయ్య, పాలెపాక లక్ష్మీనారాయణ, రూప, కోమల, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు

వేలేరు : మండల వ్యాప్తంగా ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మండలంలోని కల్వరికొండ(పులిగుట్ట)పై నిర్వహించిన వేడుకల్లో క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా విచారణ గురువులు ఫాదర్ వై. కిరణ్, తాటికొండ జోసెఫ్ మాట్లాడారు. మరణాన్ని జయించి తిరిగి సజీవుడైన దేవుడు యేసుప్రభువు అన్నారు. క్రీస్తు సమాధిలోంచి లేచి వచ్చిన శుభవేళనే ఈస్టర్ పండుగా జరుపుకొంటామన్నారు. శాంతి, ప్రేమ, క్షమాపణ, కరుణ గుణాలను అనుసరిస్తూ వాటిని పాటిస్తూ సమాజంలో జీవించాలని ఆయన అన్నారు.

శక్తివంతుడు యేసుక్రీస్తు

ధర్మసాగర్ : శక్తివంతుడు లోక రక్షకుడు యేసుక్రీస్తు అని క్రీస్తుజ్యోతి మినిస్ట్రీస్ ఫౌండర్ ప్రవక్త డాక్టర్ పాల్సన్‌రాజ్ అన్నారు. మండలంలోని కరుణాపురంలో ఆదివారం సొసైటీ ఆఫ్ క్రైస్ట్ ఆధ్వర్యంలో క్రీస్తుజ్యోతి ప్రార్థన మందిరంలో జరిగిన ఈస్టర్ వేడుకల్లో ఆయన మాట్లాడారు. ప్రపంచ మానవాళి కోసం యేసుక్రీస్తు మరణాన్ని జయించారని అన్నారు. ఈ వేడుకల్లో సినీ నటుడు బాబుమోహన్, సొసైటీ ఆఫ్ క్రైస్ట్ జనరల్ సెక్రటరీ జయప్రకాశ్‌గోపు తదితరులు పాల్గొన్నారు.

ఈస్టర్ వేడుకలు

శాయంపేట : మండల కేంద్రంలోని సీఎస్ఐ, పెంతాకోస్తు, షారోన్ చర్చి, కొత్తగట్టుసింగారంలోని దివ్యబాలయేసు చర్చి, కాట్రపల్లిలోని సీఎస్ఐ చర్చిల్లో ఆదివారం ఈస్టర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రైస్తవులు కేక్ కట్‌చేసి స్వీట్లు పంపిణీ చేశారు. పాస్టర్‌లు ఏసన్నదాసు, రవిపాల్, అనిల్‌కుమార్, మోహన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

దామెర: కుల, మతాలకు అతీతంగా సోదరభావానికి ప్రతీక ఇఫ్తార్ అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఒగ్లాపూర్ సైలానిబాబా దర్గాలో ఆదివారం ఆయన ఇఫ్తార్ ఏర్పాటు చేశారు. దర్గా పీఠాధిపతి మహమ్మద్ అబ్దుల్‌హమీద్‌కు ఖర్జూరా తినిపించి ఉపవాసం (రోజా) విరమింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముస్లిం సోదరులు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావించి భక్తి శ్రద్ధలతో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారని తెలిపారు. రంజాన్ పండుగను ప్రతి ముస్లిం సోదరుడు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని కోరారు. దర్గా అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మన్నెం ప్రకాశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలెపాక శ్రీనివాస్, మండల ప్రధానకార్యదర్శి దుర్శెట్టి భిక్షపతి, సీనియర్ నాయకులు సదిరం పోచయ్య, దామెర శంకర్, యూత్ నాయకుడు సుధాకర్, నాయకులు రాధాకృష్ణ, రాజేందర్, జక్కుల కుమార్, మహేందర్, ప్రేమ్, లింగారెడ్డి, బాబా దర్గా ప్రతినిధులు రషీద్‌బాబా, అమీర్ బాబా, ఎస్‌కే మొయినుద్దీన్, శ్రవణ్, ఖలీల్, పోతుల కొమ్మాలు తదితరులు పాల్గొన్నారు.

‘రేవూరి’ని విమర్శిస్తే గుణపాఠం తప్పదు

- మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి



మాట్లాడుతున్న భిక్షపతి

పరకాల : నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని విమర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని ప్రజలు తరిమికొట్టడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి విమర్శించారు. ఆదివారం తన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఏడు సార్లు పోటీ చేసి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి వరంగల్ ఉమ్మడి జిల్లాలోని నర్సంపేటను అభివృద్ధి పథంలో నడిపించి నేడు పరకాల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రకాశ్‌రెడ్డిని విమర్శించడం సిగ్గుచేటన్నారు. నిధుల మంజూరు లేకుండానే అభివృద్ధి పనుల పేరిటా మాయమాటలు చెప్పిన చల్లా ధర్మారెడ్డి నోరు అదుపులో పెట్టుకోవాలన్నారు. నిధులు ఉంటే పరకాల చలివాగు చెక్‌డ్యాం, కంఠాత్మకూర్ వంతెనలు ఏందుకు నిర్మించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ హయాంలో చల్లా ధర్మారెడ్డి చేసిన అభివృద్ధి ఎంటో ప్రజలకు తెలుపాలని డిమాండ్ చేశారు. పరకాల పట్టణ, నడికూడ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, దేవేందర్ , మాజీ జెడ్పీటీసీ కల్పనాదేవి, మాజీ ఎంపీపీ రాంమూర్తి, నాయకులు పూజారి సాంబయ్య, కొలుగూరి రాజేశ్వర్‌రావు, చిన్నాల గోనాథ్, పసుల రమేష్, బొచ్చు భాస్కర్, మేరుగు శ్రీశైలం పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



బందోబస్తును పరిశీలిస్తున్న ఏసీపీ, ఇన్‌స్పెక్టర్

ఖిలా వరంగల్: శాంతి భద్రతల పరిరక్షణకే తమ ధ్యేయమని వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ అన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా ఏకశిల కొండపై ప్రార్థనలు చేసేందుకు క్రైస్తవులకు అనుమతి లేదని తెలిపారు. ఎన్నికల నిబంధనలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని ఏసీపీ సూచించారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా ఖిలా వరంగల్ మధ్య కోటలోని ఏకశిల చిల్డ్రన్ పార్కులోని ఏకశిల కొండపై మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన పోలీసుల బందోబస్తును ఏసీపీ నందిరామ్‌నాయక్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఏపీపీ మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల నేపథ్యంలో ఎవరూ మతకలహాలు సృష్టించవద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బందోబస్తులో ఎస్సై గోవర్ధన్, మున్నీరుల్లా, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని ఆయా ఉద్యోగుల సంఘాల జేఏసీ బాధ్యులు కోరారు. ఈమేరకు సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరాంను హైదరాబాద్‌లో ఆదివారం వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేశారు. సుమారు 25 ఏళ్లకుపైగా యూనివర్సిటీలో పనిచేస్తున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమను క్రమబద్ధీకరించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆయా కాంట్రాక్టు ఉద్యోగుల జేఏసీ బాధ్యులు డాక్టర్ విష్ణువర్ధన్, రాయికంటి సురేష్‌కుమార్, డాక్టర్ శాగంటి శ్రీనివాస్, నాగుల శివప్రసాద్, దయాకర్, డాక్టర్ సుదయ్య, రాజమౌళి ఉన్నారు.

నూతన పంచాంగం ఆవిష్కరణ

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో తెలుగు సంవత్సరాది -2024 పంచాంగాన్ని గురు మధనానంద సరస్వతి పీఠం ఆస్థాన పీఠాధిపతి మధవానంద సరస్వతి ఆదివారం ఆవిష్కరించారు. ఇటీవల శివైక్యం పొందిన అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి రూపొందించిన పంచాంగాన్ని ఆశ్రమ పెద్దలతో కలిసి విడుదల చేశారు. మధుసూదనానంద సరస్వతి, పీఠం ఆస్థాన నిర్వాహకులు పార్నంది రఘురామ వర్మ, ప్రసాద్ శర్మ, అయినవోలు సాయికృష్ణ శర్మ, రాధాకృష్ణ శర్మ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

ఖిలా వరంగల్: రౌడీషీటర్లు భూ కబ్జాలు, గొడవల్లో తలదూర్చొద్దని, సత్ప్రవర్తనతో మెలగాలని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. వరంగల్ ఏసీపీ నందిరామ్ నాయక్ ఆదేశాల మేరకు వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ఆదివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ రౌడీషీటర్లు తమ ప్రవర్తన మార్చుకోవాలని, భూ తగాదాలు, కబ్జాలు, సెటిల్‌మెంట్లకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కుటుంబంతో కలిసి ప్రశాంత జీవనం సాగించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సైలు మున్నీరుల్లా, గోవర్ధన్, పోలీసుల సిబ్బంది పాల్గొన్నారు.

సన్మార్గం వైపు నడిపించే వారే గురువులు

విద్యారణ్యపురి: సమాజాన్ని సన్మార్గం వైపు నడిపించే వారే నిజమైన గురువులు అని, ఆ కోవకు చెందిన వారిలో ఆముదాల దాత మహర్షి ముందు వరుసలో ఉంటారని సామాజిక సామరసత వేదిక రాష్ట్ర కన్వీనర్, అఖిల భారత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ ప్రశంసించారు. తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (టీపీయూఎస్) గౌరవ అధ్యక్షుడు, ప్రభుత్వ ప్రాక్టీసింగ్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాత మహర్షి ఉద్యోగ విరమణ సందర్భంగా హనుమకొండలోని సామ జగన్మోహన్ స్మారక భవనంలో ఆదివారం సన్మాన సభ నిర్వహించారు.

వడుప్సా వరంగల్ డివిజన్ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న కార్పొరేటర్ జన్ను షీభారాణి

వరంగల్: వడుప్సా (ట్రస్మా) వరంగల్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగరంలోని నలంద ఉన్నత పాఠశాలలో వడుప్సా వరంగల్ డివిజన్ సమావేశాన్ని శనివారం రాత్రి నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా ట్రస్మా రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రావు, రాష్ట్ర సలహాదారులు కొమ్మినేని భూపాల్ రావు, కరస్పాండెంట్ షణ్ముకాచారి, 3వ డివిజన్ కార్పొరేటర్ జన్ను షీభారాణి పాల్గొన్నారు. వడుప్సా వరంగల్ డివిజన్ అధ్యక్షుడిగా బొల్లం కనకయ్య, కార్యదర్శిగా జన్ను విలియమ్స్, కోశాధికారిగా బలవారి సుధీర్, ఉపాధ్యక్షుడిగా ఎస్.రాజు, ముఖ్య సలహాదారులుగా ఎస్.సుధాకర్, సలహాదారులుగా వై.విద్యాసాగర్, సంయుక్త కార్యదర్శిగా ఎండి.నజీర్, ఎండి.ఉస్మాన్, ఆర్.అశోక్, మాధవి, ఖలీల్, సురేందర్‌తో పాటు ఈసీ మెంబర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతనం వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ షీభారాణి మాట్లాడుతూ పేద విద్యార్థులకు ఫీజులో రాయితీలో ఇవ్వాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని అభినందించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, కార్యదర్శి వెంకటేశ్వర్లు, కోశాధికారి రామమూర్తి, చంద్రారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపండి



మాట్లాడుతున్న అరూరి రమేష్

కరీమాబాద్: వర్ధన్నపేట నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో గెలిపించిన ప్రజలు.. ఇప్పుడు తనను ఎంపీగా గెలిపించి ఢిల్లీకి పంపించాలని బీజేపీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేష్ కోరారు. గ్రేటర్ పరిధిలోని మామునూరు పీఎస్‌పీ ఫంక్షన్‌హాల్‌లో వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని బూత్ కమిటీ అధ్యక్షులు, కార్యకర్తలతో ఎన్నికల సన్నాహక సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీగా ఉన్న వర్ధన్నపేటను మున్సిపాలిటీగా చేయడమే కాకుండా గ్రామాల్లో సీసీ రోడ్లు, వీధి లైట్లు వంటి అభివృద్ధి పనులు చేపట్టినట్లు గుర్తుచేశారు. రాష్ట్రాభివృద్ధిలో కూడా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం కీలకంగా నిలిచిందని పేర్కొన్నారు. పలు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరగా వారికి కండువాలు కప్పి బీజేపీ పార్లమెంట్ ప్రభారి మురళీధర్ గౌడ్, పార్టీ జిల్లాల అధ్యక్షులు గంట రవికుమార్, రావు పద్మ పార్టీలోకి ఆహ్వానించారు. మాజీ ఎమ్మెల్యేలు కొండేటి శ్రీధర్, రాజేశ్వర్‌రావు, వన్నాల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, రాజయ్యయాదవ్, కుమారస్వామి, కేశవరెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీరాములు, సునీత, అనిత, రంజిత్, వనంరెడ్డి, రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామి విగ్రహ ఊరేగింపు



కుంకుమ పూజ చేస్తున్న మహిళలు

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట గణేశ్‌నగర్‌లో అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కమిటీ ఆధ్వర్యంలో స్వామివారి విగ్రహాలను ఆదివారం ఊరేగించారు. మహిళలు మంగళహారులతో విగ్రహానికి ఎదురేగి, వాహనం ఎదుట నీళ్ల ఆరగించి కొబ్బరికాయలు కొట్టారు. సాయంత్రం అభయాంజనేయ స్వామి విగ్రహానికి సలాభిషేకం, ధాన్యాభిషేకం నిర్వహించారు. వేద పండితుడు వేణునాథాచార్యుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, పంచసూక్త హవనాలు, హోమం, పూర్ణాహుతి, శాస్త్రోక్తంగా కుంకుమ పూజ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో శ్రీనివాసరావు, సుతారి రాజు, చిన్నాల రాధాకిషన్, గుగులోతు విజయ్, సారంగం, రవీందర్, రవిబాబు, అశోక్, రాకేష్, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్, సోమయ్య, కిరణ్, సుమన్, రాకేష్, సంతోష్, ప్రసాద్, రవి పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం భీమారంలో నూతనంగా నిర్మించిన గౌరీశంకర దేవాలయంలో శివపార్వతులు, గణేశ్, దుర్గ, సాయిబాబా, ఆంజనేయ స్వామి, అయ్యప్పస్వామి, నవగ్రహ నాగేశ్వరస్వామి సహిత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఉదయం 9.17 గంటలకు యంత్ర విగ్రహమూర్తుల ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమం ప్రారంభం అవుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని మూడురోజుల పాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయని చెప్పారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే, బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అక్రమ తవ్వకాలను అరికట్టాలి



ఇష్టానుసారంగా తవ్విన గుంత

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామంలో గల మైదాం కుంటలో అక్రమంగా చేపడుతున్న మట్టితవ్వకాలను అరికట్టాలని డీవైఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మంద సురేష్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పెద్దకోడెపాక గ్రామంలోని మైదాం కుంటలో ఇరిగేషన్ అధికారులు పర్మిషన్ ఇచ్చారంటూ ఓ కాంట్రాక్టర్ చలివాగు ప్రాజెక్టు కట్ట మరమ్మతు కోసం ఇష్టానుసారంగా 10 ఫీట్ల మేరకు తవ్వకాలు జరుపుతున్నారని అన్నారు. మైదాం కుంట నుంచి రైతులు రాకపోకలు సాగిస్తున్న దారి ప్రక్కనే తవ్వకాలు జరుపడం వలన పశువులు, రైతులు ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉందని అన్నారు. అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సహాయ కార్యదర్శి నాగుల పవన్ కల్యాణ్, నాయకులు రాజు, సురేష్, రమేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు నిర్మించుకున్న కాలనీవాసులు



కల్వర్టును నిర్మించుకుంటున్న కాలనీ వాసులు

వర్ధన్నపేట: మునిసిపల్ అధికారుల నిర్లక్ష్యంతో పాటు ప్రజాప్రతినిధులు కనీస వసుతులపై పట్టించుకోకపోవడంతో కాలనీ వాసులే రెండు వార్డులను కలుపుకుని వీధిలో కల్వర్టు నిర్మించుకున్నారు. పట్టణంలోని ఒకటవ, రెండో వార్డులను కలుపుకునే వీధిలోని డ్రెయినేజీపై ఉన్న కల్వర్టు ధ్వంసం కావడంతో వాహన చోదకులు, పాదచారులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని మునిసిపల్ అధికారులకు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ పట్టించుకోలేదు. దీంతో ఆదివారం కాలనీ వాసులు ముందుకువచ్చి యువకులు చందాలు వసూలు చేసుకుని కల్వర్టును నిర్మించుకున్నారు. మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు తమ నిర్లక్ష్యాన్ని వదిలి అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

విద్యార్థులు భావి భారతపౌరులుగా ఎదగాలి




చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

నర్సంపేట: విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి భావి భారత పౌరులుగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని విజ్‌డమ్ స్కూల్లో శనివారం రాత్రి గ్రాడ్యుయేషన్ డే, వార్షికోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సరస్వతీదేవి ఆశీస్సులతో చిన్నారులందరూ జీవితంలో అత్యున్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్య ద్వారానే సమాజం అభివృద్ధిని సాధిస్తుందన్నారు. విద్య గౌరవాన్ని పెంచుతుందని, ప్రతి ఒక్కరిని సమాజంలో అత్యున్నత స్థాయిలో నిలబెడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్లు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుల ఎన్నిక

వర్ధన్నపేట: వర్ధన్నపేట, పర్వతగిరి కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులుగా ఎద్దు సత్యనారాయణ, జాటోతు శ్రీనివాస్, జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధక్షుడిగా నకిరకంటి మోహన్‌గౌడ్‌లకు స్థానిక ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు ఆదేశాల మేరకు కాంగ్రెస్ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే నాయకత్వంలో తామంతా పని చేస్తామన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అందరు నాయకులతో కలిసి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు తిరుపతి, మహేందర్‌రెడ్డి, మహేందర్, అనిల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

తటాకంలో భానుడి సోయగాలు



ఆత్మకూరు మండల కేంద్రంలోని ఇప్పలకుంటలో భానుడి సోయగాలు అరుణవర్ణంలో జలాల్ని ముద్దాడుతున్నాయి. ఆదివారం సాయంత్రం ఆకాశంలో అబ్బురపరిచే ఈ దృశ్యాన్ని ‘సాక్షి’తన కెమెరాలో బంధించింది. – ఆత్మకూరు